మా శ్రీవారు ఉద్యోగరీత్యా సైన్సు అసిస్టెంటు. మా ఊరికి పది కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలో పనిచేస్తుంటారు. ఉదయం స్కూలుకు వెళితే సాయంత్రానికి గాని ఇంటికి రారు. మాకో మూడేళ్ళ ముద్దులు మూటగట్టే కూతురుంది. నేనన్నా, పాప అన్నా మావారికి పంచప్రాణాలు. ఒక్క మాటతో చెప్పాలంటే మా సంసారం మమతలు పూచిన మల్లెపందిరి.

మా అత్తామామలు పల్లెలో వ్యవసాయపు పనులు చేయిస్తుంటారు. మేము సెలవుల్లో అక్కడికి వెళుతుంటాము. మేము అక్కడికి వెళ్ళినప్పుడల్లా మా అత్తామామల ఆనందానికి అవధులుండవు. మేమున్నన్నాళ్ళూ వారికి పండుగే.

ఇక మా శ్రీవారిది పసిమిఛాయ. ఆయనతో నన్ను పోల్చుకుంటే నాది ఒక ఛాయ తక్కువే. అదొక లోటుగా నాకనిపించేది. కానీ ఆయన ప్రవర్తనలో తేడా ఉండేది కాదు.

మా పెళ్ళి జరిగి అప్పుడే ఆరేళ్ళయిందా అని నాకనిపించేది. మా సంసారం మూడుపూవులు ఆరుకాయలన్నట్టుగా, ఏ చీకూచింతా లేకుండా జరిగిపోతున్నది.

ఒక్కొక్కరి సహవాస ఫలితం మన జీవితాల్లో కొన్ని మార్పులు తెచ్చిపెడతాయి. అందుకు ఉదాహరణ అరుణ కుటుంబం.

ఆ యేడాది మా పక్కింటిలోకి అరుణావాళ్ళు వచ్చి చేరారు. ఆమెకు బహుశా నా వయసే ఉండవచ్చు. ఇంకా పిల్లా పీచూలేరు. ఆమె కళ్ళు కలువలు. ఆమె మేనిరంగు పసిడి, చందనాల సమ్మిళితాలు. పిరుదులు దాటే ఆమె కేశసంపద చూచేవారికి కన్నుల పండుగ. ఆమె బుగ్గన పడే నొక్కులు చూస్తుంటే, ఆడదాన్ని నాకే ఆమెను ముద్దుపెట్టుకోవాలన్నంత ముచ్చట వేసేది. ఇక నా భర్త రామచంద్రరావు ఎక్కడ ఆమె ఆకర్షణలో పడతాడో అన్న బెంగ నాలో కలిగేది.

అరుణ కలుపుగోలు మనిషి. వట్టి వాగుడుకాయ. మూడునాళ్ళకే నాతో జత కట్టేసింది. నన్ను 'అక్కా' అని సంభోదించేది.

ఆమె తన పుట్టింటి గొప్పదనం, తన భర్త రాఘవరెడ్డికి వచ్చే జీతం, జీతంకన్నా పైగా వచ్చే ఆదాయం, తన కున్న నగల వివరాలు, ముందు వారు పనిచేసిన ఊరిలో కొన్ని ఇళ్ళ ప్లాట్ల వివరాలు అన్నీ చెప్పేది.

మూడు నెలలు గడిచేసరికి మా స్నేహబంధం గట్టి పడింది. వారు మా ఇంటికి రావడం, మేము వారింటికి వెళ్ళడం వాడుకయింది. నన్ను 'అక్కా' అనడం మాటటుంచి నా భర్తను 'బావా' అనేది. ఇందులో ఏదైనా గూఢార్థమున్నదేమోనని నాకు భయం వేసేది. ఒకసారి మా అమ్మ నన్ను చూడడానికి వచ్చింది. అరుణ తీరు అమ్మకు నచ్చినట్టుగా లేదు. "ఆ కళ్ళ మిణకరింపులు చూడవే. ఇలాంటివారిని కాస్త దూరంగా ఉంచాలి. కాస్త జాగ్రత్తగా ఉండు. తరువాత వగచి లాభం ఉండదు" అని తగుజాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయింది.

అప్పటినుండి మా ఆయన ప్రవర్తనలో ఏమైనా మార్పున్నదేమోనని, ఆయన నడవడి జాగ్రత్తగా పరిశీలించడం మొదలెట్టాను.

పాపం, మానవుడు తన పనేదో తనది. మొదలే మొహమాటస్థుడు, ఆపైన మితభాషి. అరుణ మా ఇంటికి వచ్చి నాతో ఉబుసుపోక కబుర్లు చెపుతుంటే ఏదో పనున్నవాడిలా అక్కడినుండి వెళ్ళిపోయేవాడు. మాట మాటా అనవలసిన తరుణంలోనూ ముక్తసరిగా ఒకటి అరా మాటల మించి మాట్లాడేవాడు కాదు. ఏదైనా అరుణతో మాట్లాడే సమయంలోనూ ఆమెను 'అమ్మా' అని సంభోదించేవాడు. కొన్నాళ్ళు ఆయన తీరు పరిశీలించాక నాలోని అనుమానం ముటుమాయమైంది.

# పీడా వదిలింది

అరుణ భర్త రాఘవరెడ్డిని చూస్తుంటేనే నాకు భయం వేసేది. అతని స్వభావం నాకేమాత్రం నచ్చేది కాదు. ఆడదాన్ని ఎన్నడూ చూడనట్టు అదే పనిగా నన్ను చూస్తుంటే నా వంటిపై తేళ్ళూ, జెర్రులూ పాకినట్టు కంపరం కలిగేది. అతను నాతో మాట్లాడేతీరు అసలు నచ్చేదికాదు. అరుణ ముఖం చూచి ఏమీ అనలేకపోయేదాన్ని. అతని మాటల్లో అతని ఆస్తి, అంతస్థుల గురించి స్వోత్కర్ష ఎక్కువగా వినిపించేది. 'ఆ', 'ఊ'లతో ఊకొట్టేదాన్ని. ఎప్పుడైనా మా ఇంటికి వస్తే మర్యాదకు కాఫీ ఇచ్చేదాన్ని. కాఫీ అందుకొనే సమయంలో కావాలనే నన్ను తాకేవాడు.

ఈమధ్య పరిస్థితి మరీఘోరంగా తయారైంది. మావారు వెళ్ళాక అతని రాకపోకలు ఎక్కువయ్యాయి. అతను మా ఇంటికి తరచుగా రావడం ఎవరైనా చూస్తే, అంతకన్నా నా భర్తకు తెలిస్తే నన్నెక్కడ అనుమానిస్తారోనని భయం కలిగేది.

"మా ఇంటికి రాకండి" అని ఎలా చెప్పను?

మాటల సందర్భంలో అప్పుడప్పుడు నా అందం ప్రస్తావన తెచ్చేవాడు.రంభలాంటి భార్యను ఇంటిలో ఉంచుకొని పరాయి ఆడదాన్ని నన్ను పొగడడంలోని అర్థం, అంతరార్థం తెలియని పసిదానినా నేను.

ఒకరోజు కాఫీ తాగుతుంటే వచ్చాడు. ఆరోజూ కాఫీ ఇచ్చాను మనసులో గొణుక్కుంటూ. కాఫీ అందుకుంటూ నా చేతి తాకుతూ 'ఐలవ్ యూ' అన్నాడు.

పరాయి భాష సౌలభ్యమిది. ఎంతటి కష్టమైన భావాన్నయినా ఒక చిన్న మాటలో వెలిబుచ్చవచ్చు.

క్షణం నిర్ఘాంతపోయాను.

"ఏమండీ, జయజానకిగారూ! మీ అందం నా మతి పోగొడుతున్నది. పరాయిసతిని కోరడం తప్పే, కానీ ఏం చేయను? మిమ్మల్ని ఒక్కక్షణం చూడకున్నా ఏదో పోగొట్టుకున్నట్టుంది. కంటికి నిదుర రావడం లేదు. తిన్న అన్నం సహించడం లేదు. ప్లీజ్! నా అభ్యర్థన మన్నించండి. నాపై దయ చూపండి. ఒక్కసారి నా కోరిక తీర్చండి"

ఏదో తెలియని అయోమయం నా మెదడు మొద్దుబారిపోయింది. కానీ క్షణాల్లో తేరుకున్నాను. వీడి ఆస్తి, అంతస్థు నా భర్త కాలిగోటికి సాటిరాగలవా? ఈ కామాంధుని కబంధ హస్తాలలో నలగడానికి ఎలా ఒప్పుకొంటాననుకొన్నాడు. చాచి చెంపలు వాయిద్దామనుకొన్నాను. అదెంతసేపు! పాము చావకూడదు, కర్ర విరగకూడదు ఎలా?

తటిల్లున నా మెదడులో ఒక ఆలోచన మెదిలింది.

"ఏమండీ! ఇంతగా నన్ను ప్రేమిస్తున్న మిమ్మల్ని కాదనడానికి నాకే కారణమూ కనిపించడం లేదు కానీ.."

"ఏమీ సంకోచించకండి. మన విషయం బయటకు పొక్కకుండా చూసే పూచీనాది" అంటూ నన్ను పొదువుకోవడానికన్నట్టు ముందుకు అడుగువేయబోయాడు.

"ఆగండి! మీ కోరిక ఎలాగూ తీరుతుంది. అంత ఆత్రమెందుకు? నాకూ ఒక కోరిక ఉంది. అది తీర్చడానికి మీరే సమర్థులు" అన్నాను కాస్త వెనుకకు జరిగి.

"ఏం కావాలి? డబ్బా, నగలా?" అన్నాడు సంతోషంగా.

"అవేం కాదు గానీ? నాకొక కష్టం వచ్చిపడింది. మీతో ఎలా చెప్పాలో తోచడం లేదు"

"మీ కష్టం నాది కాదా? జంకకుండా చెప్పండి. క్షణాల్లో తీరుస్తా"

"ఏ ముహూర్తాన మీరు వచ్చి మా పొరుగున చేరారో, అప్పటినుండే నాకొక కష్టం ఎదురయింది. అరుణను చూసినప్పటి నుండి మావారికి మతిపోయినట్టుంది. రోజూ అరుణ మాటే. ఆమె అందం తన స్వంత కావాలట. ఎలాగైనీ మీ భార్యతో మాట్లాడి ఒప్పించాలట. ఇదీ నా ప్రస్తుత పరిస్థితి. అయినా అరుణ అంత అందంగా లేని నన్ను మీరు ప్రేమిస్తున్నారంటే, అరుణను మావారు ప్రేమించడం సబబేననిపిస్తున్నది. నాకేం చేయాలో దిక్కుతోచడం లేదు. మీరు ఎలాగైనా నా కాపురం నిలపాలి. అరుణకు నచ్చజెప్పి ఆమెను ఒక్కరోజు మావారి వద్దకు పంపండి. నా సమస్య తీరిపోతుంది. ఆపైన మనమెలా ఉన్నా ఎవరూ మనలను తప్పుపట్టలేరు" అంటూ రాఘవరెడ్డి ముఖంకేసి చూశాను. పాపం, రెడ్డిగారి ముఖాన కత్తివాటుకు రక్తం లేనట్టు పాలిపోయింది. నోట మాట రావడం లేదు. ఉన్నట్టుండి వెనుతిరిగాడు. బదులేమీ చెప్పకుండా చరచరా.వెళ్ళిపోయాడు.

ఏం జరిగిందో ఏమోగానీ, ఆ మరునటి రోజునుండి అరుణ, రాఘవరెడ్డిల జాడేలేదు. వారం తిరిగేలోగా మరేదో ఊరికి బదిలీ చేయించుకొని వెళ్ళిపోయారని తెలిసింది. పీడా వదిలిందని సంతోషించాను.

**-కలవకుంట్ల గురునాథ పిళ్లై**
**(మదనపల్లి)**